క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ నాయకుడు ప్రదీప్‌రెడ్డి శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, అండర్ డ్రైనేజీలు, అంతర్గత రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, శ్రీశైలం, శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంసాహార వ్యర్థాల సేకరణకు వేలం


వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్

తుర్కయంజాల్: చికెన్, మటన్ దుకాణాల నుంచి వ్యర్థాల సేకరణకు వేలం పాటను నిర్వహించినట్లు పుర కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి తెలిపారు. శనివారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో కమిషనర్ అధ్యక్షతన వేలం పాటను నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు పోటీ పడ్డారు. ఇందులో షబ్బీర్ అనే వ్యక్తి రూ.5 లక్షల 81వేలకు హక్కులు పొందాడు. మాంసం దుకాణాల నిర్వాహకులు షబ్బీర్‌కు చెందిన వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందజేయాలని కమిషనర్ సూచించారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి


సుంకిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మాడ్గుల: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకొని, సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం కాట్రగానితండాలో శనివారం తుల్జా భవానీ మాత ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో భక్తి భావం లేకపోవడంతోనే హింసా సంస్కృతి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సుంకిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు నాగిళ్ల శివ, అభి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఎంపీ పరామర్శ


ఎమ్మెల్యే వంశీకృష్ణను పరామర్శిస్తున్న ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: గుండె ఆపరేషన్ చేయించుకుని నగరంలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు జగదీశ్వర్‌రావ్ తదితరులు ఉన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ


మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న జహంగీర్‌ఖాన్

ఇబ్రహీంపట్నం రూరల్: రంజాన్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జహంగీర్ ఖాన్ సూచించారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి సాహెబ్‌గూడలో మున్సిపాలిటీ సిబ్బందికి, పేదలకు సొంత ఖర్చుతో దుస్తులు పంపిణీ చేశారు. అల్లా దయతో ప్రజలందరూ సుఖంగా ఉండాలని కోరుకున్నారు.

శ్రమజీవుల పనిపాట్లు!

- మండుటెండలో రోడ్లు శుభ్రం చేస్తున్న వైనం
- పని వేళల్లో మార్పులు చేయాలంటు కార్మికుల వేడుకోలు
- సిబ్బంది లేమి.. పనిభారంతో సతమతం
- ఎండైనా.. వానైనా తప్పడం లేదని ఆవేదన


ఇందిరమ్మ కాలనీలో మధ్యాహ్నం రోడ్లు శుభ్రం చేస్తున్న కార్మికులు

తుర్కయంజాల్: కాలం ఏదైనా.. సమయం ఎంతైనా పారిశుద్ధ్య కార్మికులు చెమటోడ్చాల్సిందే. తెల్లవారు జాము మొదలు.. సాయంత్రం, అవసరమైతే రాత్రుల్లోనూ రహదారులు, వీధుల్లో విధులు నిర్వహిస్తుంటారు. అత్యవసర సమయాల్లోనూ ముందే ఉంటారు. అలాంటి శ్రమజీవుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేసవి కాలం నేపథ్యంలో పని వేళల్లో మార్పులు చేయాలని పలువురు కార్మికులు పలుమార్లు అధికారులను కోరారు. కోరుతున్నారు. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పనిచేయడం కష్టంగా ఉందని శ్రమజీవులు వాపోతున్నారు.

116 మంది మాత్రమే..

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 24 వార్డుల్లో లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. జనాభాకు తగినట్లుగా కార్మికుల నియామకాలు చేపట్టాల్సి ఉంది. 10వేల మందికి 28 మంది సిబ్బంది పనిచేయాలనే నిబంధన కూడా ఉంది. అయినా పుర పరిధిలో కార్మికుల సంఖ్య 116 మాత్రమే. ఒక్కో సిబ్బంది ఒక్క రోజులో 800 మీటర్ల రోడ్డును ఊడ్చాలి. కానీ అంతకంటే రెట్టింపు పని చేస్తున్నట్లు కార్మికులు చెప్పడం గమనార్హం. సగం జనాభకు సరిపోయే సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారికి పని భారం పెరిగింది.

స్వీపింగ్ మిషన్ లేక..

73 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న మున్సిపాలిటీ పరిధిలో 9 కిలో మీటర్లు సాగర్ రహదారితో పాటు 220 కి.మీ సీసీరోడ్లు, 40 కి.మీ బీటీరోడ్లు, మెటల్ రోడ్లు 24 కి.మీ, కచ్చరోడ్లు 196 కి.మీలు ఉన్నాయి. ఇంత పెద్ద మొత్తంలో రోడ్డు కలిగి ఉన్న పురపాలికలో రహదారులు ఊడ్చడానికి స్వీపింగ్ మిషన్ అందుబాటులో లేదు. సాగర్ రోడ్డుతో పాటు, ఇంజాపూర్ నుంచి తొర్రూర్, బ్రాహ్మణపల్లి మీదుగా సాగర్ రహదారి వరకు ఉండే రోడ్డు, మునగనూర్ నుంచి ఉమర్‌ఖాన్ గూడ వరకు ఉన్న రహదారులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేసినా.. ఆ యంత్రం ఒక్క గంట కూడా పనిచేయని విషయం తెలిసిందే.

రక్షణ చర్యలు ఏవీ?

ఎండల తీవ్రత పెరుగుతోంది. కార్మికుల రక్షణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తాగడానికి నీరు వెంట తెచ్చుకోవాల్సిందే. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలి. ఎండ తగలకుండా టోపీలను అందజేయాలి. అధికారులు ఈ దిశగా వెంటనే స్పందించి.. తగిన చర్యలు తీసుకోవడంతో పాటు.. 12 గంటల వరకు విధులు ముగించేలా చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఎండల తీవ్రత అధికంగా ఉన్న మాట వాస్తవమే. కమిషనర్ అమరేందర్ రెడ్డితో చర్చించి, కార్మికులు మధ్యాహ్నం 1 గంట వరకే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. డీహైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు చేపడతాం.

– ప్రవీణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, తుర్కయంజాల్

పాఠశాలలో ముందస్తు ఉగాది సంబురాలు


విద్యార్థులకు పచ్చడి అందజేస్తున్న హెచ్ఎం పరమేష్

ఇబ్రహీంపట్నం రూరల్: ఉగాది పర్వదినోత్సవాన్ని శనివారం ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ వర్కాల పరమేష్ ఆధ్వర్యంలో బడిని పచ్చతోరణాలతో తీర్చిదిద్దారు. షడ్రుచులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి


పెంటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న నీరటి పెంటయ్య శనివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. విధుల్లో ఉండగానే గుండెలో నొప్పిగా ఉందంటూ తోటి ఉద్యోగికి చెప్పి కుప్పకూలిపోయాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది.. చికిత్స నిమిత్తం ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నగరానికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. పెంటయ్య స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా తాడురు మండలం. పెంటయ్య కుటుంబ సభ్యుల ను మున్సిపల్ కమిషనర్ శంకర్ పరామర్శించారు. పుర కార్యాలయం వద్ద పెంటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్


దీక్షను విరమింపజేస్తున్న దళపతి గౌడ్

మాడ్గుల: రంజాన్ పండుగా మత సామరస్యానికి ప్రతీక అని యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధి ఇర్విన్ గ్రామం మహ్మదీయ మసీద్‌లో ఏర్పాటు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లింలకు ఖర్జూరా పండు తినిపించి, ఉపవాస దీక్షలను విరమింపజేశారు.

పన్ను భారంతో ప్రజలు సతమతం

- వెంటనే వెనక్కి తీసుకోవాలి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: పేద, మధ్య తరగతి ప్రజలపై పన్ను భారం మోపడం మంచిది కాదని, దాని వలన వారు ఇబ్బంది పడుతున్నారని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పన్ను పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఇంటి పన్ను తగ్గించాలని బీజేపీ ఆధ్వర్యంలో మీర్‌పేటలో చేపట్టిన నిరాహార దీక్ష శనివారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాష్ట్రాన్ని దివాలా తీశాయని, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీక్షలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, కొలన్ శంకర్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, సోమేశ్వర్, గాజుల మధు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం రిలే దీక్షను విరమించారు.

వంద శాతం పన్ను వసూలు

ఇబ్రహీంపట్నం: ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేసిన ఘనత ఇబ్రహీంపట్నం మండలం ముకునూర్ గ్రామానికే దక్కుతుందని ఆ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరంపన్ను లక్ష్యం చేరుకున్నామని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

- బండరావిరాల వాసి మృతి, ముగ్గురికి గాయాలు


కారులో శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం (ఇన్‌సెట్లో) శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా తిరుపతి– నాయుడు పేట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండరావిరాల గ్రామానికి చెందిన కవాడి శ్రీనివాస్‌రెడ్డి(45), సామల బాల్‌రెడ్డి, చింతల మల్‌రెడ్డి, తారమతిపేటకు భరత్‌లు స్నేహితులు. వీరు నలుగురు శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో కారులో ఇంటి నుంచి తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. శనివారం తెల్లవారు జామున 6గంటల సమయంలో నాయుడుపేట హైవేపై వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న శ్రీనివాస్‌రెడ్డి తీవ్రగాయాలతో కారులో ఇరుక్కుని, అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ముగ్గురు తీవ్రగాయాలతో తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం బండరావిరాలలో శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలు జరగనున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

మీర్‌పేట: దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార దేవాలయ ఆవరణలో రూ.16.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫ్లోరింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. ఏప్రిల్ 2న మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో.. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన, పార్టీ మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. మండల పరిధి చరికొండ, బోయిన్‌గుట్ట, ముద్విన్ గ్రామాల్లో హరీశ్‌రావు పర్యటించనున్నారని తెలిపారు. ఆయన పర్యటనను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేయనుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రజలకు, కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉగాది రోజున సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నారని తెలిపారు. త్వరలోనే చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసరా సరుకులు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని వెల్లడించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, నాయకులు మల్లేశ్‌గౌడ్, బోసురవి, భానుకిరణ్, శ్రీకాంత్, చందు, కుమార్, నరేశ్ తదితరులు ఉన్నారు.

మెదక్‌పల్లిలో విషాదఛాయలు

- నివాళి అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి


అంత్య క్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

తలకొండపల్లి: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విష ఆహారం తిని ముగ్గురు పిల్లలు మృతి చెందిన విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం మండల పరిధి మెదక్‌పల్లికి చెందిన చెన్నయ్య, రజిత దంపతులు జీవనోపాధి కోసం అమీన్‌పూర్‌కు వెళ్లారు. గురువారం రాత్రి చెన్నయ్య ఇద్దరు కుమారులు, కూతురు, భార్య విష ఆహారం తిన్నారు. ఈ ఘటనలో ముగ్గురు పిల్లలు మృతి చెందగా.. రజిత ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను గాంధీకి తరలించారు. అక్కడి నుంచి శనివారం అంత్యక్రియల కోసం మెదక్‌పల్లికి తీసుకెళ్లారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. కడసారి చూపుకోసం ప్రజలు తరలి వచ్చారు. ఒకేసారి ముగ్గురు చిన్నారులు దుర్మరణం చెందడం వారిని కలచి వేసింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి మృత దేహాలపై పుష్ప గుచ్ఛం ఉంచి, నివాళులర్పించారు. ఆర్థిక సహాయం అందజేశారు.

ఆచారి పదవి కోసం పూజలు


హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న కమలనాథులు

ఆమనగల్లు: బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారికి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులు కోరుతున్నారు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో ఆ పార్టీ మున్సిపాలిటీ కన్వీనర్ కర్నాటి విక్రంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆచారికి.. అధ్యక్ష పదవి దక్కాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, కృష్ణానాయక్, శ్రీధర్, రవిరాథోడ్, ప్రశాంత్, సందీప్, విష్ణుచారి, రాజు, అశోక్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీఓ

ఇబ్రహీంపట్నం: గ్రామ కార్యదర్శి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ముకునూర్ గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం మండల పంచాయతీ ఆఫీసర్ రఘు ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఉపాధి'కి మరింత భరోసా


గంగారంలో ఉపాధిహామీ పని చేస్తున్న కూలీలు

ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు కేంద్ర ప్రభుత్వం మరింత ప్రయోజనం కల్పించింది. కూలీల వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా గతంలో రూ.300లు చెల్లించగా.. ఏప్రిల్ ఒకటి నుంచి అదనంగా రూ.7 చెల్లించనుంది.

- కూలీ రూ.300 నుంచి రూ.307కు పెంపు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- హర్షం వ్యక్తంచేస్తున్న కూలీలు

మహేశ్వరం: కూలీల వలసలను తగ్గించి, ఉన్న ఊరిలోనే పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా కూలీలకు అందించే వేతనాన్ని ఏటా పెంచుతూ మరింత భరోసాను కల్పిస్తోంది. తాజాగా రూ.7 పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు రోజువారీగా రూ.300 కూలీ చెల్లిస్తుండగా, ఏప్రిల్ ఒకటో తేది నుంచి రూ.307 ఇవ్వనుంది. దీంతో కార్మిక కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరనుంది.

రూ.87.50 నుంచి 307కు

2005లో ఉపాధిహామీ పథకం ప్రారంభం అయింది. మొదట్లో కూలీలకు రూ.87.50 చెల్లించేవారు. 2022లో రూ.12 పెంచగా, 2023లో గరిష్ఠంగా కూలీని రూ.272, 2024లో రూ.300, 2025–2026 ఆర్థిక సంవత్సరానికి రూ.307గా కేంద్రం నిర్ణయించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొత్త వేతనాలు అమలు చేస్తోంది.

జాబ్‌కార్డులు 6,576

మహేశ్వరం మండలం 30 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. మొత్తం జాబ్‌కార్డులు– 6,576, కూలీలు– 9,242, పని చేసిన చేస్తున్న కుటుంబాలు 1,004 ఉన్నాయి. పథకం కింద గ్రామాల్లో చెరువుల పూడిక తీత, కాల్వల పూడిక తీత, కాల్వల మరమ్మతు, వనమహోత్సవం కింద చెట్లు నాటడం, భూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పనుల కొలతల ప్రకారమే ప్రభుత్వం కూలీలకు వేతనం చెల్లిస్తుంది.


ఇతర పనులపై మొగ్గు

కూలీ రేట్లు ఏటా పెంచుతున్నా.. కూలీలు మాత్రం ఉపాధి పనులపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపే వారు. ప్రస్తుతం రూ.307 కూలీ చెల్లిస్తున్నా.. పనుల కొలత ప్రకారమే కూలీ ఇస్తుండడంతో కూలీలకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. ఇదిలా ఉండగా.. ప్రైవేట్ సెక్టార్లలో కూలీల కొరత ఉండటం, కూలీ రూ.500 నుంచి 700 చెల్లిస్తుండటంతో ఉపాధి కూలీలు అటువైపు మొగ్గుచూపుతున్నారు. ఇక వ్యవసాయ పనుల సమయంలో కూలీలకు డిమాండ్ పెరగడంతో పాటు, డబ్బులు ఎక్కువగా ఇవ్వడమే కాకుండా.. రైతులు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో కూలీలు అటూ వెళ్తున్నారు. ఉపాధి కూలీ తక్కువగా ఉండటమే ఇందుకు కారణం కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం తెచ్చింది. ఉపాధిహామీ పనులు చేసిన వారికే ఈ పథకానికి అర్హులంటూ నిబంధన పెట్టింది. దీంతో ఉపాధిహామీ పనులు చేయడానికి కూలీలు ఆసక్తి చూపుతున్నారు.

కూలీల సంఖ్య పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు

ఉపాధిహామీ పథకం కూలీల సంఖ్య పెంచేందుకు సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు మండల పరిధి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామ సభలు, డప్పు చాటింపు చేయిస్తున్నారు. ప్రభుత్వం అందించే కూలీ, ఇతర అలవెన్సుల గురించి వివరిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ఉపాధిహామీ జాబ్ కార్డు కలిగిన వారందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థికంగా ఎదగడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కూలీ రేట్లు పెంచింది. దీంతో కూలీలకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం.